క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని అక్కల్‌చెడకు చెందిన బాదావత్ రవికుమార్ మంజూరైన రూ.16 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్ ఆదివారం పంపిణీ చేశారు. అనంతరం గోపాల్ మాట్లాడారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో రవికుమార్‌కు సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైందని చెప్పారు. ప్రజలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పులిశేరు రాజేందర్, మాజీ సర్పంచ్ తూటి పావని రమేష్, మాజీ ఉపసర్పంచ్ భానోతు వీరన్ననాయక్, నాయకులు బాదావత్ పెద్ద వీరు, ముత్యం భద్రయ్య, తేజావత్ భద్రు, మైనార్టీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి షేక్ ఫయాజ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

నేడు బీటెక్ ఫస్టియర్ విద్యార్థులకు ఓరియంటేషన్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం (2025 - 2026)లో ప్రవేశాలు పొందిన బీటెక్ ఫస్టియర్ విద్యార్థులకు ఈనెల 18న క్యాంపస్‌లోని సెనెట్ హాల్‌లో ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రమణ, కన్వీనర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మహేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, వరంగల్ టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి, కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం, ఇంజనీరింగ్ విభాగం డీన్ ప్రొఫెసర్ ఎం.సదానందం పాల్గొంటారని పేర్కొన్నారు.

రవీందర్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్: హనుమకొండకు చెందిన ఎడ్ల రవీందర్‌కు ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ) డాక్టరేట్ ప్రకటించింది. హైదరాబాద్‌లోని ఓయూలో ఫిజిక్స్ విభాగంలో పరిశోధకుడిగా గ్రీన్ సింథసిస్ డిరైవిడ్ సల్ఫాయిడ్ టెల్లురైడ్ బేస్డ్ నానో స్ట్రక్చరర్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ అప్లికేషన్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి రవీందర్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఓయూ ఫిజిక్స్‌విభాగం ప్రొఫెసర్ కటకం మధుకర్ పర్యవేక్షణలో రవీందర్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. రవీందర్ ప్రస్తుతం హనుమకొండలోని ఓ ప్రైవేట్ కళాశాలలో భౌతికశాస్త్ర అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు.

మున్నూరు కాపు సంఘం 'రాష్ట్ర కార్యదర్శిగా' కోటేశ్వరమ్మ



ఖిలా వరంగల్: మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా వరంగల్ శివనగర్‌కు చెందిన కామిశెట్టి కోటేశ్వరమ్మ నియమితులయ్యారు. ఈ మేరకు ఆమెకు రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తమ రావు పటేల్ ఆదివారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరమ్మ మాట్లాడుతూ మున్నూరు కాపుల సంక్షేమం, ఐక్యత కోసం కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా కమిటీ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం



మడికొండ: ఓ వృద్ధుడు అదృశ్యమైన సంఘటన మడికొండలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మడికొండ గ్రామంలోని శ్రీసాయి ఆర్చిడ్ కాలనీకి చెందిన మాదడి కృష్ణారెడ్డి(74) కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. శనివారం రాత్రి కుటుంబ సభ్యులు ఇంట్లో పడుకొని ఉండగా ఎవరికీ చెప్పకుండా కృష్ణారెడ్డి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఈ క్రమంలో అతడి కోసం కుటుంబ సభ్యులు అన్ని చోట్ల ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. వృద్ధుడి కుమారుడు మాదడి రఘు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు. వృద్ధుడి ఆచూకీ తెలిసిన వారు 87126 85248 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

కొనసాగుతున్న సీపీఎం శిక్షణ తరగతులు



ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు గుట్ట రాంచందర్ భవనంలోని సీపీఎం జిల్లా ప్రధాన కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి సీహెచ్ రంగయ్య ఆధ్వర్యంలో రెండో రోజు ఆదివారం శిక్షణ తరగతులు కొనసాగాయి. శిక్షణ తరగతులకు రామన్నపేట, కరీమాబాద్ ఏరియా నుంచి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. పార్టీ జిల్లా కార్యదర్శి సీహెచ్ రంగయ్యతోపాటు నాయకుడు అరూరి రమేష్ హాజరై వివిధ అంశాలపై మార్గ నిర్దేశం చేశారు. ప్రజా సమస్యలపై పోరాడాలని వారు సూచించారు. సీపీఎం నాయకులు ఉన్నారు.

వైన్స్‌లో నిల్.. బెల్ట్‌షాపుల్లో ఫుల్

- సిండికేట్‌గా మారిన మద్యం వ్యాపారులు
- బీర్లు, స్థానికంగా డిమాండ్ ఉన్న బ్రాండ్లు 'బెల్ట్'కు సరఫరా
- గ్రామాల్లో పుట్టగొడుగుల్లా వెలిసిన బెల్ట్‌షాపులు
- అర్ధరాత్రి అయినా ఆగని విక్రయాలు
- ఎక్సైజ్‌శాఖపై స్థానికుల విమర్శలు

వేలేరు : మండలంలో వీధికో బెల్ట్‌షాపు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఆయా గ్రామాల్లో తెల్లవారుజామున 3 గంటల నుంచి రాత్రి ఒంటిగంట వరకు తెరుచుకుని ఉండడంతో మద్యం ఏరులైపారుతోంది. సంబంధితశాఖ అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం మద్యం దుకాణాలకు సెలవు ప్రకటించినా బెల్ట్‌షాపుల్లో మాత్రం బ్రాండ్‌కో రేటు చొప్పున విక్రయాలు జోరుగా సాగుతున్నాయని ప్రచారం జరుగుతోంది. వైన్స్ షాపు రాత్రి 10 గంటలకు మూసివేయడంతో మందుబాబులు బెల్ట్‌షాపుల దారి పడుతున్నారని, మద్యం తాగి తరుచూ గొడవలు చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపైన కూర్చొని మద్యం తాగుతుండడంతో మహిళలు, పిల్లలు రోడ్డెక్కాలంటే భయాందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు వాపోతున్నారు. కాగా కష్టపడిన సొమ్ము మద్యానికి పెడుతున్నారని పలు కుటుంబాల మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కిరాణాలే బెల్ట్‌షాపులు

గ్రామాల్లో బెల్ట్‌షాపులంటే మద్యం దుకాణాలుగా కనిపించవు. మొదట కిరాణాలుగా ఏర్పాటు చేసి అందులోనే మద్యం విక్రయాలు జరుపుతున్నారు. బీర్లు, స్థానికంగా డిమండ్ ఉన్న మద్యాన్ని వైన్‌షాపులో విక్రయించకుండా బెల్ట్‌షాపుల నుంచి విక్రయాలు జరుపుతూ సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వ్యక్తం ఉన్నాయి. ఉదయం రాత్రి వరకు ఏ సమయంలోనైనా మద్యం విక్రయాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు తొంగిచూడడం లేదనే విమర్శలు స్థానికంగా వస్తున్నాయి.

ప్రోత్సహిస్తున్న వైన్స్ నిర్వాహకులు

మండల కేంద్రంలో రెండు వైన్‌షాపులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇవి ఒకే చోట ఉండటంతో సిండికేట్‌గా ఏర్పడ్డాయి. దీంతో ఒక వైన్‌షాపు నుంచి గ్రామాల్లోని బెల్ట్‌షాపులకు మద్యం విక్రయాలు జరుపుతూ బెల్ట్‌షాపులను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకు గాను బెల్ట్ షాపుల నిర్వాహకుల నుంచి వైన్‌షాపు యాజమానులు ఒక్కో బీరుపై రూ.25, ఫుల్ బాటిల్‌పై రూ.80 వరకు అధికంగా వసూలు చేస్తున్నట్లు సమాచారం. అయితే బెల్ట్‌షాపు నిర్వాహకులు మందుబాబుల వద్ద నుంచి బీరుపై రూ.25, ఫుల్ బాటిల్‌పై రూ.80 అధికంగా వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని పలువురు అంటున్నారు. వైన్‌షాపులో ప్రత్యేకంగా ఓ కౌంటర్ ఏర్పాటు చేసి బెల్ట్‌షాపుల నిర్వాహకులకు మద్యం విక్రయిస్తున్నట్లు తెలిసింది. బెల్ట్‌షాపు నిర్వాహకుల నుంచి అక్రమంగా వసూలు చేస్తూ వారు కోరినంత మద్యం ఇస్తుండడంతో గ్రామాల్లో మద్యం ఏరులైపారుతుందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి గ్రామాల్లో బెల్ట్‌షాపులను కట్టడి చేయాలని, మందుబాబుల ఆగడాలకు అడ్డుకట్ట చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బెల్ట్‌షాపులను అరికట్టాలి



మండలంలో బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా వెలిశాయి. ఒక్కో గ్రామంలో పదిహేనుకు పైగానే ఉండటంతో యువకులు మద్యానికి బానిసలవుతున్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల జరుగుతున్నాయి. గ్రామాల్లో బెల్ట్‌షాపులను అరికట్టే విధంగా ప్రజాప్రతినిధులు, ఎక్సైజ్‌శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– రాజు, బీజేపీ మండల అధ్యక్షుడు

కాంగ్రెస్ హయాంలోనే సంక్షేమం

- మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి

నల్లబెల్లి : కాంగ్రెస్ హయాంలోనే సంక్షేమం అందుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని నారక్కపేటకు చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో పేదలకు ఇళ్లు కట్టించలేదని, రేషన్ కార్డులు కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల హామీల అమలుకు ప్రణాళికాయుతంగా కార్యాచరణ చేపట్టిందని తెలిపారు. గతంలోనూ కాంగ్రెస్ హయాంలోనే భూములు, ఇళ్ల పంపిణీ జరిగిందని చెప్పారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు అవుతాయని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలన పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. గ్రామాల అభివృద్ధి కోసం పార్టీని ప్రజలు ఆదరించాలని ఆకాంక్షించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్, నాయకులు శేఖర్, సుమన్, కుమారస్వామి, రమేష్, శివ పాల్గొన్నారు.

ఉడుతగూడెంలో వన భోజనాలు

ఐనవోలు : మండలంలోని ఉడుతగూడెం గ్రామంలోని ఓ రిసార్ట్‌లో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రశాంత్‌నగర్ వాసులు శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని సామూహిక వనభోజనాలు ఆదివారం జరుపుకొన్నారు. ప్రముఖ మెజీషియన్ శ్రీనివాస్‌రెడ్డి ఆటల పోటీలు నిర్వహించారు. సుమారు 150 మంది హాజరైన కార్యక్రమం.. ఆటాపాటలతో ఉత్సాహంగా జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు. సంఘం గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి, సంఘ బాధ్యులు వెంకటరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వన భోజనాల్లో రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు

ఓటు చోరీపై కొవ్వొత్తులతో నిరసన



కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూరు : ఓటు చోరీపై యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓటు చోరీ చేసిందని నినాదాలు చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీధర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సందీప్, మాజీ సొసైటీ చైర్మన్ రవీందర్‌గౌడ్, మాజీ సర్పంచ్ రాజు, సొసైటీ డైరెక్టర్ జైపాల్‌రెడ్డి, నాయకులు కుమారస్వామి, వెంకటేశ్వర్లు, రవి, రాజు, ప్రసాద్, కేదారి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

- అభినందించిన ఉపాధ్యాయులు

ఎల్కతుర్తి : ఈనెల 16వ తేదీన జేఎస్ఎస్ స్టేడియంలో జరిగిన హనుమకొండ జిల్లాస్థాయి అండర్–15 వాలీబాల్ బాల, బాలికల క్రీడా పోటీల్లో ఎల్కతుర్తి మండలం బావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన బి.సిరి, కే.కీర్తన, బి.ఐశ్వర్య, డి.హర్షిత, ఎస్.సౌమ్య, బాలుర విభాగంలో ఎం.సంతోశ్, జి.రాహుల్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎమ్ మనోహర్‌నాయక్ ఆదివారం తెలిపారు. నేటి నుంచి 19వ తేదీ వరకు ఇబ్రహీంపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ సుధాకర్, ఉపాధ్యాయులు మధుకర్, శ్రీధర్, అనిత, శారద, ప్రభ, ముకుందరెడ్డి, రాజేశ్వరచారి, సీఆర్పీ రవికుమార్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో పోచమ్మతల్లి బోనాలు

దామెర : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఆదివారం పోచమ్మ బోనాల సందడి నెలకొంది. మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలను డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగింపు నిర్వహించి పోచమ్మ ఆలయాలకు చేరుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలుచేసి, బోనాన్ని నైవేద్యంగా సమర్పించారు. నూతన వస్త్రాలు, గాజులు, టెంకాయలు, పసుపు, కుంకుమ, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. పిల్లపాపలను, పాడిపంటలను చల్లగా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు బోనాలతో తరలిరావడంతో మండల కేంద్రంలో పండుగ వాతావరణం నెలకొంది. చిన్నారుల కేరింతల నడుమ మహిళల నృత్యాలు ఆకట్టుకున్నాయి.



బోనాలతో వెళ్తున్న మహిళలు

బాధిత కుటుంబాలకు పరామర్శ

కమలాపూర్ : కమలాపూర్, వంగపల్లి, శనిగరం, గూడూరు, ఉప్పల్ తదితర గ్రామాల్లో ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన బాధిత కుటుంబాలతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న పలు కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు తొటం రవీందర్, బాలసాని రమేశ్‌గౌడ్, రాజిరెడ్డి, శ్రీకాంత్, మనీష్, రమేష్, చంద్రమౌళి, ప్రభాకర్, పీఏసీఎస్ చైర్మన్ సంపత్‌రావు, న్యాయవాది కళాధర్ పాల్గొన్నారు.

వెలుగని వీధిలైట్లు

ధర్మసాగర్ : మండలంలోని తాటికాయల గ్రామంలో గల దళితవాడలో చీకటి కమ్ముకుంది. బోనాల పండుగ సందర్భంగా గ్రామమంతా వెలుగులతో విరజిమ్ముతుండగా దళితవాడ మాత్రం చీకట్లలో మగ్గిపోతోందని ఆ వాడకు చెందిన పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యం వహిస్తున్నాడని ఆరోపించారు. ఇతర కాలనీల్లో విద్యుత్ హైమాస్క్ లైట్లు ఏర్పాటు చేశారని, కానీ తమ వాడను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తమ వాడలో వీధి దీపాలు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యం వహించిన పంచాయతీ కార్యదర్శిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు స్పందించాలని ఈ సందర్భంగా వారు కోరారు.

కౌశిక్‌రెడ్డిని కంటి ఆస్పత్రిలో చూపించాలి

కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ ఇన్‌చార్జ్ ప్రణవ్

కమలాపూర్ : హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కళ్లుండి చూడలేని కబోది అని, వెంటనే కంటి ఆస్పత్రిలో చూపించాలని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ ఎద్దేవా చేశారు. మండలంలోని శనిగరంలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుడు సారయ్య నిర్మించుకుంటున్న ఇంటిని ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు దశల వారిగా అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. ప్రభుత్వం మొదటి విడుతగా నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేసిందన్నారు. కౌశిక్‌రెడ్డి సొంత మండలం వీణవంకలో కూడా నిర్మాణాలు కొనసాగుతున్నాయని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో డబుల్ బెడ్రూం పేరుతో కాలయాపన చేసి ఒక్క ఇల్లు కూడా ఇవ్వకపోగా, కనీసం కట్టిన డబుల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందని, గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు చూస్తుంటే బీఆర్ఎస్ పార్టీ నేతలకు కళ్లు మండుతున్నాయని అన్నారు. కౌశిక్‌రెడ్డి సోషల్ మీడియా వేదికగా ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. ప్రజా సమస్యలు పట్టించుకోని కౌశిక్‌రెడ్డి ప్రజలపై కపట ప్రేమ చూపించడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమేశ్‌గౌడ్, శ్రీకాంత్, శ్రీనివాస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారుడితో మాట్లాడుతున్న ప్రణవ్

భయపెడుతున్న డెంగీ కేసులు

- రోజురోజుకూ పెరుగుతున్న జ్వరపీడితులు

వేలేరు : మండల కేంద్రంలో డెంగీ జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. పలు కాలనీల్లో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేకపోవడం, డ్రెయినేజీ శుభ్రపరచక పోవడంతో నీటి నిల్వల కారణంగా దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతున్నాయని స్థానికులు తెలిపారు. వాటి నివారణకు అధికారులు చర్యలు చేపట్టడం లేదని దీంతో డెంగీ జ్వరం బారిన పడుతున్నామని వాపోతున్నారు. మూడు రోజుల క్రితం వేలేరు బీసీ కాలనీకి చెందిన చిన్నారి సూత్రపు శాన్విక (07) డెంగీతో మృతి చెందిన విషయం తెలిసిందే. అలాగే వేలేరు ఎస్సీ కాలనీలో ఇంటికో వ్యక్తి జ్వరంతో బాధపడుతున్నారు. ఇంట్లో ఓ వ్యక్తికి జ్వరం తగ్గదల కాక ముందే మరో వ్యక్తికి జ్వరం వస్తుడటంతో కాలనీ వాసులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సరైన సౌకర్యాలు, వసతులు, మందులు లేకపోవడంతో రోగులు ప్రైవేట్ ఆస్పత్రులకు పురుగులు తీస్తున్నారు. డెంగీ కేసులు పెరుగుతున్నప్పటికీ అధికారులు చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, పాలకులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.



108 వాహనంలో బాలికను ఎంజీఎంకు తరలిస్తున్న తల్లిదండ్రులు (ఫైల్)

'స్థానికం'లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

దామెర : స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దుర్శెట్టి భిక్షపతి కార్యకర్తలకు సూచించారు. మండల కేంద్రంతో పాటు ల్యాదెళ్లలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ బోలోపేతానికి ప్రతిఒక్కరూ సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను గడపగడపకు వివరించాలని సూచించారు. ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు పోశాలు, రవి, కుమార్, నగేష్, మల్లయ్య, హరీష్ , రవియాదవ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భిక్షపతి

సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా ప్రశాంత్

ధర్మసాగర్ : మండలంలోని కరుణాపురం గ్రామానికి చెందిన రాజారపు ప్రశాంత్‌ను కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్‌గా నియమిస్తున్నట్లు సోషల్ మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్ మన్నే సతీష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హనుమకొండలోని ఆయన నివాసంలో ప్రశాంత్‌కు నియామకపత్రం అందించినట్లు పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, రాష్ట్ర, జిల్లా సోషల్ మీడియా సభ్యులు, మండల నాయకులకు ప్రశాంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



డ్రెయినేజీ నిర్మాణమెప్పుడో..?

- రోడ్డు విస్తరణలో తొలగించిన డ్రైనేజ్
- స్థానికులకు తప్పని తిప్పలు
- ప్రమాదకరంగా గేట్‌వాల్వ్

శాయంపేట : పల్లెలు పచ్చదనం, పరిశుభ్రతతో ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నా శాయంపేట మండలంలో మాత్రం కొన్ని పనులు ముందుకుసాగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రం నుంచి ఆత్మకూరు వెళ్లే రహదారిని రోడ్డు వెడల్పులో శాయంపేట సెంటర్ నుంచి గ్రామ శివారు వరకు ఉన్న సైడ్ డ్రెయినేజీని పూర్తిగా తొలగించారు. అయితే నాలుగేళ్లు గడుస్తున్నా మళ్లీ సైడ్ డ్రెయినేజీ పనులు చేపట్టకపోవడంతో మురుగునీరు రోడ్డుపై నిలిచి కంపు కొడుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే మండలంలోని 24 గ్రామాల పరిస్థితి మరీ అధ్వానంగా ఉందని పలువురు వాపోతున్నారు.

ప్రమాదకరంగా గేట్‌వాల్వ్

మాజీ సర్పంచ్ ఇంటి ఎదుట ఉన్న గేట్‌వాల్వ్ పైకప్పు లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. ప్రయాణికులకు గేట్‌వాల్వ్ కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగిన సదర్భాలు ఉన్నాయని స్థానికులు అంటున్నారు. ఇంతే కాకుండా గేట్‌వాల్వ్‌లో వరద నీరు నిలవడంతో నల్లాల ద్వారా కలుషిత నీరు వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలుషిత నీరు తాగడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని భయాందోలన చెందుతున్నారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు దృష్టిసారించి సైడ్ డ్రెయినేజీని త్వరగా నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



మండల కేంద్రంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు



వర్షపు నీటితో నిండిన గేట్‌వాల్వ్

ఇబ్బందులు తొలగించాలి



నాలుగేళ్ల క్రితం రోడ్డు విస్తరణలో సైడ్ డ్రెయినేజీ తొలగించారు. దీంతో అప్పటి నుంచి మురుగునీరు రోడ్లపైనే నిలుస్తుంది. దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

– మార్త తిలకాంబ, శాయంపేట

మత్తడి దుంకిన చలివాగు

- 18 ఫీట్లకు చేరిన నీటిమట్టం

శాయంపేట : మండలంలోని జోగంపల్లి శివారు చలివాగు ప్రాజెక్టులోకి ఎగువన కురిసిన వర్షాలతో వరద, కటాక్షపూర్ చెరువు నీరు ప్రవహించడంతో చలివాగు జలకళతో నిండుకుండలా కనిపిస్తోంది. ఆదివారం తెల్లవారుజామున ప్రాజెక్టు నీటి మట్టం 18 ఫీట్లకు చేరుకుని మత్తడి పోసింది. దీంతో ఆయకట్టు రైతులు, మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేశారు. చలివాగులో సమృద్ధిగా నీరు ఉంటేనే శాయంపేట, పరకాల, రేగొండ, చిట్యాల మండలాలకు సాగునీరుతో పాటు మిషన్ భగీరథ పథకంలో తాగునీరు సరఫరా కానుంది.

